
కథ



# మరో కోణం

- ఎమ్.హేమలత



"**అరే!** ఆంటీ మీరా! రండి, రండి వినీల వదిన, ఎవరో వచ్చారని అంటే ఎవరబ్బా అనుకున్నాను. మిమ్మల్ని ఎప్పుడో తన పెళ్లిలో చూసింది కదా గుర్తు పట్టినట్లు లేదు వదిన. అమ్మ చిన్ననాటి స్నేహితురాలు వదినా! మాకు అత్యంత ప్రియమైన ఆంటీ అని చెప్తుంటామే ఆ ఆంటీ ...." ఆప్యాయంగా పలకరిస్తూ లోపలికి ఆహ్వానించింది కామాక్షిని, సబిత.

"ఏంటమ్మా! సబితా! ఇల్లంతా చాలా హడావుడిగా ఉంది. ఏదయినా ఫంక్షనా? అన్నట్లు పిల్లలేరీ? నువ్వూ, మీ అన్నయ్య రమాకాంత్ తమ్ముడు విష్ణు అందరూ ఇండియా వస్తున్నట్లు ఒక వారం క్రితం దుర్గ చెప్పింది" అంది, కామాక్షి సోఫాలో కూచుంటూ.

దూరంగా నిల్చొని కొత్తగా వచ్చిన ఈవిడ ఎవరా అన్నట్లు కుతూహలంగా చూస్తున్న పిల్లల్ని దగ్గరికి పిలిచింది సబిత.

"ఆంటీ! ఈ ఎర్ర ఫ్రాకు సిసింద్రీ రమాకాంతన్నయ్య కూతురు లీనా. మీకు తెలుసు కదా వాళ్లకి ఈ పాపొక్కతే. వీడేమో విష్ణు కొడుకు. అల్లరిలో ఎంత పిడుగో, చదువులో అంత ఘటికుడు. అమ్మమ్మకు నీ పేరేంటో చెప్పరా..."అంది సబిత.

"అయామ్ జాన్!" అన్నాడు ఠీవిగా ఆ గడుగ్గాయి.

'అదేంటి!' అన్నట్లు ఆశ్చర్యంగా చూస్తున్న కామాక్షికేసి నవ్వుతూ చూసి "వాడి అసలు పేరు జానకీరామ్ ఆంటీ! కానీ స్కూల్లో నోరు తిరక్క వాడి ఫ్రెండ్స్ వాడిని జాన్ అని పిలుస్తారట!" వినీల కేసి చూస్తూ అంది సబిత.

"ఓహో! అమెరికావాస్తవ్యులు కదా! మన పేర్లు ఆ దేశంలో అలా రూపాంతరం చెందడం మామూలేగా! అయినా అసలు విషయం చెప్పరేంట్రా?" రెట్టించింది కామాక్షి.

'ఇవాళ మా పాప 'లయ' పుట్టిన రోజాంటీ ఫస్ట్ బర్త్ డే" అంది, సబిత.

"అలాగా! అయితే మంచి సమయానికే వచ్చానన్నమాట! మీ అమ్మ దుర్గ ఎక్కడా కనిపించదు? వంటింట్లో యమ బిజీగా ఉందా?" అంటూ అటూ ఇటూ చూసింది కామాక్షి, దుర్గ కోసం.

సబిత, వినీల ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"సబితా! మీ అమ్మ షాపింగ్‌కికానీ వెళ్లిందా?" మళ్లీ అడిగింది కామాక్షి.

"లేదాంటీ! అమ్మ వరంగల్ వెళ్లింది. ప్రొద్దుటే సహజమార్గ్ వాళ్ల సమావేశాల్లో పాల్గొనేటందుకు. రేపు సాయంత్రానికి వస్తుండొచ్చు..."

ఫోన్ రింగ్ అవడంతో "వన్ మినిట్ ఆంటీ" అంటూ సబిత అటుకేసి నడిచింది.

కామాక్షికి కొంచెం విడ్డూరమనిపించింది. రాకరాక పిల్లలందరూ వస్తే ఈవిడ ఇలా వెళ్లిపోవడం ఏంటో!

విష్ణుకాంత్ చికాగో వెళ్లి ఆరేళ్లయిం ి. వాడు ఫ స్టేట్స్ అంటూ, అటుతర్వాత జాబ్ అంటూ, పైన వినీల వీసా ప్రాబ్లెమ్ అంటూ ఇండియా రావడం వాయిదాలు వేసుకుంటూ పోయాడు. జానకిరామ్, వాడే జాన్ పుట్టడం కూడా అక్కడే. తనకి మనవడు పుట్టాడనీ, వాడికి వాళ్ల తాతగారి పేరు పెట్టారనీ ఎంతో మురిసిపోతూ దుర్గ చెప్పడం కామాక్షికి ఇప్పటికీ గుర్తు

సబిత అడపాదడపా ఇండియాకు వస్తూపోతూ ఉన్నా పాపాయి పుట్టాక రావడం ఇప్పుడే. 'పెద్దవాడు రమాకాంత్ మాత్రం ఇండియానూ, నన్నూ వదిలి ఎక్కడికీ వెళ్లడు కామాక్షీ!' అంటూ చెప్తుండేది దుర్గ. కానీ, ఏమయింది? వాడూ రెండేళ్ల క్రితం భార్య ప్రోద్బలంతో అయితేనేం, వ్యక్తిగతమైన కోరికల వల్ల అయితేనేం కాలిఫోర్నియా వెళ్లిపోయాడు.

వాడు వెళ్లిపోయిన రోజు దుర్గ తనదగ్గర బాధ పడడం తనకింకా బాగా గుర్తు. కామాక్షి కూడా 'రమా, నువ్వయినా దుర్గ దగ్గర ఉండకుంటే ఎలా బాబూ!' అని ఎంతో చెప్పి చూసింది. కానీ ఏం లాభం? వాడూ వెళ్లిపోయాడు.

తన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "ఆంటీ! మీరు అమ్మకు ప్రాణస్నేహితురాలు కదా! అమ్మ ఏ పని చేసినా మీతో సంప్రదించకుండా, మీకు చెప్పకుండా చెయ్యదు కదా..." అంది సబిత కామాక్షికి దగ్గరగా వచ్చి కూచుంటూ.

సబిత చెప్పబోతున్న పెద్ద కథకి ఇది చిరుపీఠిక అని అర్థమైంది కామాక్షికి.

"మేము హైదరాబాద్ వస్తున్నట్లు పదిరోజుల క్రితమే అమ్మకు ఫోన్ చేసి చెప్పాం. నేనూ, కమల్, పాప పుట్టాక పోయిన జులైలోనే వద్దామనుకున్నాం. ఈ లోగా కాకినాడ నుంచి మామగారు, కొత్త ఇల్లు డిసెంబరు ఆఖరికి తయారవుతుంది, అప్పుడు వస్తే గృహప్రవేశం, పాప బర్త్ డే రెండూ కలుపుకోవచ్చు అంటూ చెప్పడంతో పోస్ట్‌పోన్ చేసుకున్నాం.

"రమా అన్నయ్యేమో, రెండేళ్ల వీసా కదా, ఇండియాకు తప్పక వచ్చివెళ్లాలంటూ వచ్చాడు. ఇక విష్ణు ఆఫీసు పని కలిసివచ్చిందంటూ భార్యని, పిల్లల్ని తీసుకొనివచ్చాడు. ఏమైతేనేం అందరం ఒక్కమారే ప్లాన్ చేసుకుని వచ్చివద్దాం."

"సంతోషమే కదమ్మా! మీరందరూ వచ్చారని దుర్గచాలా ఆనందించివుంటుందే!"

"అమ్మ, ఆనందం మాట ఏమో కానీ మాకంతా చాలా ఇబ్బందిగా ఉందాంటీ ఇక్కడ."

"అదేంటమ్మా ఇబ్బందంటావ్ ఎందుకూ?"

"మేడమీద పోర్షన్ మాకందుబాటులో లేదిప్పుడు..."

"ఏం! స్టేర్ కేస్ రిపేరులో ఉందా?"

"జోకెందుకు లెండి ఆంటీ! ఆ పోర్షన్ సత్‌సంఘ్ డిసైపుల్స్ ఉండడానికి అమ్మ కేటాయించింది. కింద ఉన్న ఈ రెండు బెడ్‌రూముల్లో ఇంతమందిమి ఎలా సర్దుకోగలం, మీరే చెప్పండి! కనీసం ముందు వేపు రూమున్నా కాస్త బాగుండేది. అందులో ఎప్పటి నుంచో మా చుట్టాలబ్బాయి ఉంటున్నాడు. అమ్మకి సహాయం కదా అని మేమేనాడూ అందుకు అభ్యంతరం చెప్పలేదు."


"నాతో ఆ మధ్య అంది దుర్గ సత్‌సంఘ్ వాళ్లుండేదేందుకు సరైన ఇల్లు దొరకలేదనీ, కొద్దిరోజులు ఇంటి మేడమీద వాళ్లని ఉండమన్నాననీ. ఏకాఏకీ వాళ్లకి ఆ పోర్షన్ అద్దెకు ఇచ్చిందని నాకు తెలీదే!"

"అయ్యో రామ! అద్దెకు కూడా కాదు, ఊరికేనే ఉండమని వాళ్లకి ఇచ్చేసింది. అదేమని అన్నయ్య అడిగితే అది నా స్వవిషయం, మీకది అనవసరం అంటూ ముక్తసరిగా సమాధానం ఇచ్చి వెళ్లిపోయింది. అన్నయ్యకి కోపం వచ్చి వాడి తోడల్లుడి ఇంటికి వెళ్లిపోయాడు-జూబ్లీహిల్స్‌కి. వదిన మాత్రం ఈ రోజు ఫంక్షన్ కదా అని ఉండిపోయింది. పాపం వదినకు ఉన్నపాటి అక్కరా, అభిమానం అమ్మకి లేకపోయాయి. భక్తిప్రవచనాలు, ప్రార్థనలు అంటూ పాప పుట్టినరోజు కూడా ఇల్లు పట్టకుండా తిరుగుతోంది. మా వారు నన్ను దెప్పుతున్నారు, కాకినాడలో పాప పుట్టినరోజు చేసుకునే వాళ్లం కదా అంటూ" సబిత కళ్లనీళ్లపర్యంతం అవుతోంటే, కామాక్షికి చెప్పొద్దూ... జాలేసింది.

"అదేంటి దుర్గ అంత విచిత్రంగా ప్రవర్తిస్తోంది? పిల్లలంటే ప్రాణం పెట్టేది, ఏ పనైనా పిల్లల తర్వాతే అన్నట్లు మీ చుట్టూ తిరిగేది?"

"అవన్నీ పాతరోజులాంటీ! అమ్మ ఇప్పుడు చాలా మారిపోయింది. తన విషయాలే తప్ప ఇంకెవరి విషయమూ పట్టించుకోవడం లేదు. పిల్లల్ని కూడా అంటీముట్టనట్లు పలకరించింది. ఇంట్లో అన్నీ ఉన్నాయి. ఇంకేమైనా కావాలంటే హోటల్లో ఆర్డరివ్వండి అంటూ పిల్లల చేతుల్లో అయిదేసివేలు పెట్టి మరీ వెళ్లింది. మీరే చెప్పండి ఆంటీ ఇదేమయినా న్యాయంగా ఉందా అమ్మకు?"

"సబితా! నువ్వు బాధపడకమ్మా! ఈ మధ్య దుర్గ ఆధ్యాత్మికంగా చాలాదూరం వెళ్లిపోయింది. ఎప్పుడు మాట్లాడినా, గురుదేవులు, సద్భావనాసమావేశాలు, ప్రవచనాలు అంటూంటుంది పోన్లేమ్మా! నేను వచ్చానుగా. మనందరం కలిసి పాప పుట్టినరోజు పండగ ఘనంగా కానిచ్చేద్దాం. ఇంతకూ బర్త్ డే బేబీ ఎక్కడ..." అంటూ సబిత వెంట కామాక్షి లోనికి



నడిచింది.

ముద్దులు మూటగట్టే లయని చూస్తే కామాక్షికి ముచ్చటేసింది. మిసమిసలాడే ఆ రబ్బరుబొమ్మను వదిలి దుర్గ వరంగల్ ఎలా వెళ్ళగలిగిందా అని కొంచెం అబ్బురపడింది కూడా!

000

"దుర్గా! పిల్లలొస్తారు... వస్తారు.. అన్నంతసేపు పట్టలేదు కదా వాళ్ళు రావడం, వెళ్ళిపోవడం కూడా."

కామాక్షి మాటలకు ఒక్కమారు ఆవిడకేసి చూసి ఔనన్నట్లు తలూపి మళ్ళీ పూలమాల కట్టడంలో మునిగిపోయింది దుర్గ.

ఆ రోజు దుర్గ ఇంట్లో సద్భావనాకార్యక్రమం. గురుదేవుల పటం ముందు రంగవల్లుల్ని తీర్చిదిద్దడం అయింది. ఇక పూలతో అలంకరించడమే తరువాయి. ఈ పూజావిధానాలే తన జీవితధ్యేయం అన్నంత చిత్తశుద్ధితో, భక్తిపారవశ్యంతో పనుల్లో నిమగ్నురాలైన స్నేహితురాల్ని చూస్తే పిల్లలే నా దేవుళ్ళు అన్నట్లుంటే ఆ నాటి దుర్గేనా ఈ దుర్గ అనిపించింది కామాక్షికి.

"దుర్గా! నేను చెప్పేదేమైనా వినిపిస్తోందా?" అంది, కామాక్షి కొంచెం అసహనంగా.

"ఎందుకు వినిపించడం లేదు. నాకేమైనా చెవుడు అనుకుంటున్నావా? బాగానే వినిపించింది" అంది, ముక్కాలిపీటని మధ్యకి జరుపుతూ.

"సబిత నాతో చెప్పుకుని ఎంత బాధపడిందో తెలుసా?!"

"కామూ! ఇప్పుడా ప్రసక్తి ఎందుకు? నేనిప్పుడు తీరుబడిగా మాట్లాడే పరిస్థితిలో వున్నానా? ఇంకాస్సేపటికి మా వాళ్ళంతా వస్తారు. నీకు ఓపికుంటే నాకు కాస్త సాయంచేయి. నా పిల్లల్లాగా నీకూ నా మీద కోపం ఉంటే దయచేయి" అంది తాపీగా దుర్గ.

'ఏమిటీ దుర్గ! ఈవిడ ధోరణి అసలు అర్థం కావడంలేదు' అని మనసులో అనుకుని నెత్తి కొట్టుకుని పూజాకార్యక్రమంలో దుర్గకి సాయపడసాగింది కామాక్షి.

సద్భావనాసమావేశానంతరం వచ్చినవారు ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయాక స్నేహితురాళ్ళిద్దరూ మిగిలారు.

"కామూ! నువ్వీరోజు ఇంటికెళ్ళవా? చాలా పొద్దుపోయింది" కామాక్షి పక్కన కూచుంటూ అంది దుర్గ.

"అమృతకి ఇందాక ఫోన్‌చేసి చెప్పానులే రేపు పొద్దుటవస్తానని అయినా నేనిలా రాత్రులు నీతో గడపడం మా వాళ్ళకి కొత్త కాదుగా!"

"అలాగా! మరీ సంతోషం. నేనైతే శనివారం పళ్ళూ, పాలూ తీసుకుంటాను. నీకేదయినా టిఫిన్ చేయనా?" లేవబోయింది, దుర్గ.

"ఏంటి దుర్గా! నువ్వు పాలూ, పళ్ళతో ఉండగా లేంది నాకు టిఫిన్ కావాలా? నాకూ అవే చాలు. ఇక కూచో నీతో నేను చాలా మాట్లాడాలి" అంటూ కామాక్షి, దుర్గను తన పక్కనే కూలేసింది.

"ఊఁ కానీ! నువ్వు నాతో ఘర్షణ పడ్డానికే వచ్చావని, సాయంత్రమే నాకు అర్థమైందిలే!" అంది దుర్గ.


"నిజమే దుర్గా! నీతో దెబ్బలాడాలనే పనిగట్టుకుని వచ్చాను. నీ పద్ధతి నాకు అసలు నచ్చడంలేదు. సబిత, రమా, విష్ణు ఎంత చిన్నబుచ్చుకుని వెళ్ళారో నీకేమైనా అర్థమైందా? అంత దూరం నుండి వాళ్ళు వస్తే వాళ్ళ కోసం అంటూ పూర్తిగా ఒక్కరోజయినా గడిపావా? నీ సభలేమో, సమావేశాలేమో, ప్రవచనాలేమో!" కొంచెం వెటకారం ధ్వనించింది కామాక్షి మాటల్లో.

"ఏమంటున్నావు కామూ! నా పనులు కొన్ని మానుకుని వారితో గడిపి ఉండవచ్చునని కదూ! వచ్చినప్పటినుండి అటూ ఇటూ బిజీగా తిరుగుతూ నాతో ఓ గంటైనా స్థిమితంగా కూచుని మాట్లాడారా వాళ్ళు? కామూ! నన్ను తప్పు పడ్తున్నావు కానీ ఎంత మానసికక్షోభను అనుభవించి ఎంత కష్టపడి ఈ స్థితికి నన్ను నేను తయారుచేసుకున్నాను? నాకంటూ ఓ జీవితవిధానాన్నీ, నాకు తృప్తినీ, ఆత్మానందాన్నీ ఇచ్చే ఓ మార్గాన్ని ఎన్నుకున్నాను. ఆ మార్గం వెంట నడుస్తూ ఇప్పుడిప్పుడే మనశ్శాంతిని పొందుతున్నాను."

"అరే! ఓ నెలరోజులు నీ ఆక్టివిటీస్ పక్కన పెట్టి ఇన్నేళ్ళకి పుట్టింటికి వచ్చిన బిడ్డలకి అమ్మగా ఆదరణ, అప్యాయత చూపించి ఉండవచ్చు గదా! నువ్వు తల్లివేనా దుర్గా? పిల్లల పట్ల అంత నిర్దాక్షిణ్యంగా ఏమీ పట్టనట్లు ఎలా ఉండగలిగావు?"

"అవును కామూ! అమ్మనే! నా పిల్లలే నా లోకంగా నిన్నటివరకు బతికిన సగటుతల్లినే! మా వారు ఒక నెలరోజులు ఎటైనా వెళ్ళివద్దామంటే పిల్లల చదువులు, పరీక్షలు వాళ్ళకి ఇబ్బంది అంటూ ఆయన్ని నిరాశపరిచేదాన్ని. పై చదువులంటూ డాక్టరైన భర్త కమల్‌తో కలిసి యు.కె వెళ్ళిన సబిత చదువయ్యాక ఇండియా తిరిగి వస్తుందని ఆశించాను. సబిత నాన్నగారు మాత్రం చాలా గర్వంగా చెప్పుకునేవారు అమ్మాయీ, అల్లుడూ ఫారిన్‌లో పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారంటూ. వాళ్ళిద్దరూ యు.కె.లో ఉండగానే నేనూ ఆయనా వెళ్ళి చూసొచ్చాం. నీకు గుర్తుండే ఉంటుంది.

"సరే, విధి చిన్నచూపు చూసి మా వారు గుండెపోటుతో పోయారు. అమ్మాయి పరాయిదై పరాయిదేశంలో సెటిల్ అయినా, కొడుకులు దగ్గరున్నారన్న ధీమాతో బతుకు సాగించాను కొంతకాలం. విష్ణుకి మంచి ఆఫర్ వచ్చిందని వాడూ వెళ్ళిపోయాడు యు.ఎస్.కి. అప్పుడే నాలో చెప్పలేని అభద్రతాభావం చోటుచేసుకుంది. నేను ఒంటరిదాన్ని అవుతానని కాదు పిల్లల్ని వదిలి వుండగలనా అన్న భయం... బెంగ. సరే, కాలమే గాయాన్ని మాన్పుతుంది. అందుకూ అలవాటు పడ్డాను. కానీ రమాకాంత్ కూడా వెళ్ళిపోవడం నాకు పెద్ద దెబ్బ. ఇంత పెద్ద ఇంట్లో ఈ రెండంతస్తుల మేడలో నేనొక్కదాన్నీ ఒంటరిగా



ఎలారా ఉండేది అని అడిగాను రమాని.

"అమ్మా! నాకు మంచిఅవకాశం వచ్చింది వెళ్తున్నాను. విష్ణుని వెనక్కిరమ్మని చెప్పమ్మా నీకు సాయం అంటూ వెళ్లిపోయాడు రమా. విష్ణు ఏమన్నాడో తెలుసా కామూ? అమ్మా! నువ్వు మాత్రం ఒక్కదానివీ ఇండియాలో ఎందుకు ఇక్కడికే వచ్చేయ్ అంటూ..." దుర్గ కంఠం గద్గదమవడం గమనించింది కామాక్షి.

"దుర్గా! ఇప్పుడిదంతా సహజం. పిల్లలు పెద్దచదువులంటూ మంచి ఉద్యోగాలంటూ దొరికిన అవకాశాల్ని ఎందుకు వదులుకుంటారు చెప్పు!"

"అవును కామూ! నిజమే! వాళ్లు అవన్నీ ఎందుకు వదులుకుంటారు? వాళ్లు వదులుకొనేది మాతృభూమినీ, కన్నతల్లిని మాత్రమే!" ఎంతో నిర్వేదంగా అంటున్న దుర్గ మాటలకు ఒక మారు ఉలిక్కిపడింది కామాక్షి.

"కామూ! నేను పిల్లల్ని తప్పు పట్టడం లేదు. నిజమే. నువ్వన్నట్లు వచ్చే సువర్ణావకాశాన్ని కాలదన్నుకోరు. వాళ్లకి రెక్కలొచ్చి ఒక్కరొక్కరే ఎగిరిపోయారు. నన్ను రమ్మన్నారు చూడు, అదే నాకు నచ్చలేదు. నా స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్నీ, నా ఇష్టానిష్టాల్నీ వదులుకొని పంజరంలో పక్షిలా అక్కడ వాళ్ల యాంత్రికజీవితంలోకి వెళ్లి నేను ఇమడలేను. అందుకే నేను ఇక్కడ ఒక్కదాన్నీ ఉండిపోవడానికే నిశ్చయించుకున్నాను. కానీ, కామాక్షీ, ఎన్నడూ ఒంటరిగా ఉండడం అలవాటు లేని నాలో ఆ రోజులు చెప్పలేనంత బాధనూ, మనస్తాపాన్నీ మిగిల్చాయి. నువ్వు కూడా ఆ సమయంలో ఇక్కడ లేవు. కిశోర్ దగ్గరకి డెహరాడూన్ వెళ్లావు. నన్ను నేను కూడగట్టుకొని నిలబడడానికి నాకింత చేయూతా, ధైర్యం సమకూర్చిందీ ఎవరనుకున్నావ్? అదో ఆ ఫోటోలోని పూజ్యగురుదేవులు.

"ఒంటరితనాన్నీ, శూన్యజీవితాన్నీ తట్టుకోలేక ఓ సాయంత్రం ఆయన ఉపన్యాసం వినడానికి వెళ్లాను. ఆ రోజు నేను మరచిపోలేని రోజు. నా జీవితం మలుపు తిరిగిన రోజు, నా శేషజీవితం ఎలా గడపాలో నాకు స్ఫురింపజేసినరోజు. పిల్లలు జీవితమార్గమధ్యంలో మనకు తగిలే బాటసారుల వంటివారు. మన గమ్యం చేరుకోడానికి ఏ విధంగానూ ఉపయోగపడని పాంథులు వాళ్లు. గురువాక్కుడే మనకు కరదీపిక. అతని బోధనలే మనల్ని నిశ్చల ఆనందసాగరం వైపు నడిపిస్తాయి."

దుర్గ ముఖంలో ఓ అనిర్వచనీయమైన తృప్తి, ప్రశాంతత చూసి కామాక్షి విస్తుపోయింది. "దుర్గా, నువ్వు చెప్పేది బాగానే ఉంది. నీకంటూ ఓ జీవితాని ఏర్పాటు చేసుకున్నావ్. సంతోషంగా ఉన్నావ్. అంతమాత్రం చేత నాల్గురోజులు నీతో గడపడానికి వచ్చిన కన్నపిల్లల్ని అలా నిర్లక్ష్యం చేసి వాళ్లని బాధపెట్టడం న్యాయమా? మేడ మీది భాగం కూడా ఎవరికో ఇచ్చేసి పిల్లల్ని ఇబ్బంది పెట్టడం నీకు భావ్యంగా ఉందా?"

"ఓహో! పిల్లలు నీతో ఈ విషయం కూడా చర్చించారన్నమాట. ఇప్పుడు చెప్తున్నాను విను కామూ! ఆ మధ్య నాకు గుండెపోటు వచ్చి హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాను గుర్తుందా?"

"ఆఁ ఆఁ ఎందుకు గుర్తు లేదూ? నాకు కబురు తెలిసేసరికి నువ్వు ఆంజియోప్లాస్టీ చేసుకొని ఇంటికి కూడా వచ్చేశావు!"

"అప్పుడు నా దగ్గర ఉన్నది ఎవరనుకున్నావ్? నా భజనమండలి సభ్యురాళ్లంటూ మీరంతా ఎగతాళి చేసిన మా సేవాసంఘసభ్యురాళ్లు!"

"అరే! నేనెందుకు ఎగతాళి చేస్తాను దుర్గా?" అంది నొచ్చుకుంటూ కామాక్షి.

"నువ్వంటే నువ్వు కాదనుకో! నాకు ఆరోగ్యం బాగాలేదని మా సత్‌సంఘ్ సభ్యురాలు పిల్లకి ఫోన్లు చేస్తే శరవేగంతో వచ్చినవి ఏంటనుకున్నావ్? డాలర్లు... మంచిట్రీట్‌మెంట్ ఇప్పించండి. మేము వీలుచూసుకుని వస్తామంటూ ఇ-మెయిల్సు. వాళ్లు వస్తారని నేనేనాడూ ఆశలు పెట్టుకోలేదు. అందుకే అంత ధైర్యంగా ఉండగలిగాను. ఇక వాళ్లు వచ్చినప్పుడు వాళ్ల కోసం మేడమీది పోర్షన్ ఖాళీగా ఉంచలేదని కదూ వాళ్ల ఫిర్యాదు? ఒక్కొక్కగదిలో ఇద్దరేసి సత్‌సంఘ్ సభ్యురాళ్లు ఉంటున్నారు ఉన్న రెండు గదుల్లో. ప్రార్థనలకు, ప్రవచనాలకు, ఉపాసనలకు, గురుదేవులు హైదరాబాద్ వచ్చినప్పుడు ఉండడానికి హాలు అట్టేపెట్టి ఉంచాము. పిల్లలు వచ్చారని పాపం వాళ్లని ఎక్కడికి పొమ్మనను?

"ఆ పిల్లలైనా వచ్చింది నా కోసమా? నాకు సందేహమే! 24 గంటలూ షాపింగులు, స్నేహితుల ఇళ్లలో పార్టీలు, అటూ ఇటూ ఊర్లు తిరగడాలు, ఎప్పుడో రోజుకో నిముషం నాతో పొడిపొడి కబుర్లు. నా శారీరక, మానసిక, భౌతికశక్తులన్నీ ఆధ్యాత్మికదృష్టి వైపు మరల్చుకొని ఈ రెండేళ్లుగా కఠినసాధనతో నా ప్రస్తుతదినచర్యను మలచుకున్నాను. ఉన్నట్టుండి నేనీనాడు, నా పిల్లల్ని సంతోషపరచడం కోసం నా పాత జీవితంలోకి వెళ్లిపోయి, ఈ శాశ్వత నిశ్చల పరమానందాన్ని, పారమార్థికపథాన్ని విడిచిపెట్టమంటావా?

"నా పిల్లలే నా సర్వస్వం అంటూ బతకడానికి నా పిల్లలు కారు కామాక్షీ, వాళ్లిప్పుడు! వాళ్లకంటూ జీవితం ఏర్పరచుకున్నారు. అందులో నాకు చోటు లేదు. మరి నాకంటూ ఓ జీవితం అక్కర్లేదంటావా? అలా ఏర్పాటు చేసుకోవడం తప్పంటావా? స్వార్థమంటావా? చెప్పు కామూ! నా కన్నీళ్లు తుడవడానికి ఎవరున్నారుచెప్పు నా గురుదేవులు, నాతోపాటు ఉంటున్న నా ఆధ్యాత్మికబంధువులు తప్ప..."

ఓ అలౌకిక మనోవివేకానందస్థితిలో సచేతనంగా, స్థిరంగా మాట్లాడుతున్న దుర్గకేమీ సమాధానం చెప్పలేనిదై, తనకి అర్థం కానంత ఎత్తుకి ఎదిగి పోయిన, తన స్నేహితురాలిలో ఒక కొత్త కోణాన్ని స్పృశిస్తున్నట్లు చూస్తూ వుండిపోయింది కామాక్షి.

■

